www.prajasakti.com

ప్రజాశక్తి

బుధవారం 4 డిసెంబర్ 2024

5

వైఎస్ఆర్



వరికి అపార నష్టం

- ఫెంగల్ బారిన 847 ఎకరాలు - ఆందోళనలో జిల్లా రైతాంగం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 847 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. సోమ, మంగళవారాల్లో కురిసిన కురిసిన వర్షానికి రైతాంగం నష్టపోయింది. జిల్లా వ్యవసాయశాఖ అధికార యంత్రాంగం ప్రాథమిక నివేదికలో పేర్కొంది. జిల్లాలో కెసికెనాల్, తెలుగుగంగ రిజర్వాయర్, మైలవరం రిజర్వాయర్ పరిధిలో సుమారు 90 వేల ఎకరాల వరకు వరి పంటను సాగు చేసిన సంగతి తెలిసిందే. ఖరీఫ్ సీజన్‌కు చెందిన వరి ఫెంగల్ తుపాన్ బారిన పడి పంట నేలకొరగడం, పొట్టల్లోకి నీరు చేరడం, నీట మునగడం, వరి కోత కోసిన పంటల్లోకి నీరు చేరడం వంటి కారణాలతో తీవ్ర నష్టం వాటిల్లింది.

ఇక అమృత్ 2.0



రూ.462 కోట్లతో శుద్ధజలం
బండికనుమ దగ్గర డబ్ల్యూటిపి ఏర్పాటు
45 కిలోమీటర్ల ట్రీట్మెంట్ సంప్ నిర్మాణానికి కసరత్తు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కడప నగరానికి సురక్షిత శుద్ధజలం అందనుంది. కేంద్ర, రాష్ట్ర, మున్సిపాలిటీల సంయుక్త భాగస్వామ్యంతో అమృత్ 2.0 ఫేజ్-1 కింద శుద్ధి చేసిన తాగునీటి సరఫరా పథకం పట్టాలెక్కింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.462 కోట్లు కేటాయించాయి. కేంద్రం వాటా కింద రూ.151 కోట్లు, రాష్ట్ర వాటా కింద రూ.255 కోట్లు, కార్పొరేషన్ వాటా కింద రూ.13.68 కోట్లు, 15 ఫైనాన్స్ నిధుల నుంచి మరో రూ.33.12 కోట్లు కేటాయించినట్లు తెలుస్తోంది. కేంద్ర, రాష్ట్ర, మున్సిపల్ యంత్రాంగాలు రాబోయే 15 ఏళ్లలో పెరగనున్న 7.5 లక్షల జనాభాను దృష్టిలో ఉంచుకుని నిబంధనల్ని రూపొందించాయి. 2024 మార్చి మూడున నిర్వహించిన టెండర్ నిర్వహించింది. అరబిందో, బిఆర్‌సిసిఎల్ జాయింట్ వెంచర్ కంపెనీ కాంట్రాక్టును దక్కించుకుంది. 2024 మార్చి నుంచి 2026 మార్చిలోపు పనులు పూర్తి చేయాలని గడువును నిర్దేశించింది. అమృత్ 2.0 ఫేజ్-1 పనుల్లో భాగంగా బ్రహ్మసాగర్ రిజర్వాయర్ ఇన్‌టెక్ వేల్‌లో వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ నిర్మించాల్సి ఉంది. దీనికి 45 కిలోమీటర్ల పరిధిలో ట్రీట్మెంట్ సంప్ ఏర్పాటు చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. అక్కడి నుంచి ఎలివేటెడ్ లెవెల్ సర్వ్ రిజర్వాయర్ (యుఎల్‌ఎస్‌ఆర్) ద్వారా కడప నగరానికి సమీపంలోని బండికనుమ 9.5 మిలియన్ ఎంఎల్‌డి శుద్ధ జలాన్ని సరఫరా చేయనుంది. అక్కడి నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పైప్‌లైన్ల ద్వారా నగరానికి సురక్షితమైన తాగునీటిని సరఫరా చేయనుంది. కాంట్రాక్టు వెంచర్ కంపెనీ అమృత్ 2.0 ఫేజ్-1 సంబంధించి సర్వే పనులు చేపట్టింది. బండికనుమ దగ్గర 13 ఎకరాల స్థలం, బ్రహ్మసాగర్ దగ్గర అప్రోచ్ రోడ్డు సహా తొమ్మిది ఎకరాల స్థలం రెవెన్యూ యంత్రాంగం కేటాయించాల్సి ఉంది. బ్రహ్మసాగర్ రిజర్వా యర్ దగ్గర ఇన్‌టెక్ వాల్ నిర్మాణ పనులకు జిల్లా నీటిపారుదల శాఖ, 45 కి.మీ మేర ఎన్‌హెచ్ డిపార్టుమెంట్ అనుమతులు ఇవ్వాల్సి ఉంది. మౌలిక వసతుల కల్పన అనంతరం కాంట్రాక్టు సంస్థ అమృత్ 2.0 పనులు చేపట్టనుంది. 2026 మార్చి నాటికి పూర్తిస్థాయిలో సురక్షిత శుద్ధజలాన్ని సరఫరా చేయాల్సి ఉంది.



సర్వే చేస్తున్న అధికారులు

పింఛా జలాశయానికి జలకళ

పూర్తి స్థాయిలో నీటి నిల్వ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఎట్టకేలకు పింఛా జలాశయం జలకళను సంతరించుకుంది. బంగాళాఖాతంలో నెలకొన్న రోజుల కింద ఏర్పడిన ఫెంగల్ తుపాన్ ధాటికి పింఛా 0.327 టిఎంసిల పూర్తి సామర్థ్యాన్ని సంతరించుకుంది. అన్నమయ్య జిల్లా బాహుదానదిపై పింఛా రిజర్వాయర్ నిర్మించారు. 2020 నవంబర్ 19న సంభవించిన నివర్ తుపాన్ ధాటికి రిజర్వాయర్ మట్టికట్టలు తెగిపోయిన సంగతి తెలిసిందే. అనంతరం జిల్లా నీటిపారుదల శాఖ సుమారు రూ.62 కోట్లతో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులకు ప్రతిపాదనలను పంపించింది. అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అనంతరం జిల్లా నీటిపారుదల శాఖ మట్టికట్టల పునరుద్ధరణ పనులు చేపట్టింది. మూడేళ్ల వ్యవధిలో పింఛా రిజర్వాయర్ పునరుద్ధరణ పనులు పూర్తి చేసింది. ఫెంగల్ తుపాన్ ధాటికి పింఛా జలాశయం మంగళవారం మధ్యాహ్నానికి పూర్తి స్థాయిలో నిండిపోయింది. అనంతరం నిల్వ చేసిన నీటిని గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేసింది.



ట్రూ అప్ భారాన్ని తక్షణమే రద్దు చేయాలి

- సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్

ప్రజాశక్తి - కడప అర్బన్

రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ అదనపు ఛార్జీల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం కడపలోని ఆర్‌టిసి బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ సర్కిల్లో సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో విద్యుత్ అదనపు భారాలను రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల బిగింపు ఆపాలని, అదాని ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల తిరగకముందే రూ.15,484 కోట్ల విద్యుత్ భారాన్ని ప్రజలపై వేయడం దారుణమన్నారు. 2022 -23 సంవత్సరాల్లో విని యోగించుకున్న విద్యుత్‌పై రూ.6072 కోట్ల సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం నుంచి వసూలు చేయటం శోచనీయమన్నారు. వచ్చే నెల నుంచి 2023 -24 సర్దుబాటు ఛార్జీ రూ.9412 కోట్ల భారం పడనుందన్నారు. ఇప్పటికే 2014-19 ట్రూ అప్ ఛార్జీలు, గత నెల బిల్లులపై 40 పైసలు సర్దుబాటు ఛార్జీ వసూళ్ల చేస్తు న్నారన్నారు. తాజాగా మూడవ సర్దుబాటు ఛార్జీ బిల్లులో వేశారు, వచ్చేనెల 4వ సర్దుబాటు ఛార్జీ కలపటానికి రంగం సిద్ధం అయ్యిం దన్నారు. ఈ నెల బిల్లులలో 10 శాతం నుంచి 30 శాతం వరకు బిల్లులు పెరిగాయన్నారు. నిరుపేదలపై మరింత భారం పడిం దన్నారు. విద్యుత్ ఛార్జీలు 30 శాతం ఉండగా సర్దుబాటు ఛార్జీలు, అదనపు ఛార్జీలు 70 శాతం ఉండటం దారుణమన్నారు. ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని మాట ఇచ్చిన కూటమి, నేడు మాట తప్పి ప్రజలను వంచించిందన్నారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేయాల్సిన బాధ్యత కూటమిపై ఉండగా, భారం మోపి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ఒకవైపున సోలార్ విద్యుత్ ఉత్పత్తి ధరలు యూనిట్ రూ.12 నుంచి క్రమంగా రూ.2కు తగ్గాయని చెబుతూనే, ఛార్జీలు మాత్రం తగ్గించకుండా పెంచడం అన్యాయ మన్నారు. బడా కార్పొరేట్లకు దోచి పెట్టే విధానాలు వలనే విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్నాయన్నారు. ఒకవైపున కార్పొరేట్లతో కుమ్మక్కై పాలక పార్టీలు అవినీతికి పాల్పడినట్లు ఆధారాలు వెల్లడైనప్పటికీ కూటమి ప్రభుత్వం దానిపై విచారణ జరపకుండా, చర్యలు తీసుకో కుండా ప్రజలపై విద్యుత్ ఛార్జీల భారాన్ని వేయటం అక్రమ మన్నారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలపై ప్రజలు గళం విప్పాలని పిలుపునిచ్చారు. కేంద్ర, రాష్ట్ర పాలకులను నిలదీయాలన్నారు. మరో విద్యుత్ పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలన్నారు. మంత్రి వర్గ సమావేశం లో ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం చర్చించి సర్దుబాటు ఛార్జీల భారాన్ని నిలిపివేయాలన్నారు. అదానీతో చేసుకున్న ఒప్పందాలను రద్దు చేయాలని, మాట ఇచ్చినట్లు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర కమిటీ సభ్యులు జమీలా, కామనూరు శ్రీనివాస్ రెడ్డి దస్తగిరి రెడ్డి, కుమారస్వామి రెడ్డి, చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, కామేశ్వరమ్మ, రామకృష్ణారెడ్డి, రాజామణి, షంశాద్, లతీఫా, మాధవ రెడ్డి , శివకుమార్, తిమ్మయ్య, అభినయ్, నరసింహ, విజయ్, పాలయ్య పాల్గొన్నారు.



నిరసన వ్యక్తం చేస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

7 వేల పక్కా గృహాలు రద్దు

ప్రొద్దుటూరులోనే అత్యధికం - కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయం

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో ఏడు వేల పక్కాగృహాలు రద్దుకు రంగం సిద్ధమైంది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన నిర్వహించిన మంత్రి మం డలి సమావేశం పక్కాగృహాలపై నిర్ణయం తీసుకుంది. వైసిపి హయాంలో జిల్లాలో 99 వేల ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టని ఇళ్లను రద్దు చేయాలని నిర్ణయించింది. జిల్లాలో 18 వేల పక్కా గృహాల లబ్ధిదారులు ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టలేదు. ప్రభుత్వం వంద రోజుల ప్రణాళికలో భాగంగా జిల్లా హౌసింగ్ యంత్రాంగం 18 వేల ఇళ్ల లబ్ధి దారులకు నోటీసులు జారీ చేయడం, అవగాహన కల్పించడం వల్ల 11 వేల మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టడానికి ముందుకు వచ్చారు. మిగిలిన ఏడు వేల మంది లబ్ధిదారులు ఎటువంటి పనులు చేపట్టని నేపథ్యంలో రద్దుకు అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ప్రొద్దుటూరు నియోజకవర్గ పరిధిలోనే అత్యధికంగా 1000 పక్కా గృహాలు రద్దు కానున్నట్లు సమాచారం. ఇప్పటికే జిల్లా హౌసింగ్ అధికార యంత్రాంగం ఎటువంటి నిర్మాణ పనులు చేపట్టని డేటాను కత్తిరింపుల పుస్తకంలో జాబితాను చేర్చింది. తాజాగా కేబినెట్ తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో రద్దయ్యే అవకాశాలు పుష్కలముగా ఉన్నాయని చెప్పవచ్చు.

జిఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఇ బదిలీ

ప్రజాశక్తి - కడప ప్రతినిధి : జిఎన్‌ఎస్‌ఎస్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎం. మల్లికార్జునరెడ్డి బదిలీ అయ్యారు. ప్రభుత్వం మంగళవారం జిఒఆర్‌టి నెంబర్ 406 జారీ చేసింది. వైసిపి హయాంలో జిఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఇతోపాటు కడప చీఫ్ ఇంజినీర్ (ఎఫ్‌ఎసి)గా విధులు నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చీఫ్ ఇంజినీర్‌గా బదిలీ చేసింది. తిరుపతి సిఇగా విధులు నిర్వహిస్తూ, కడప జిఎన్‌ఎస్‌ఎస్ ఎస్‌ఇగా విధులు నిర్వహిఒచడం కష్టంగా మారిన నేపథ్యంలో తిరుపతి జిల్లా తెలుగుగంగ, జిఎన్‌ఎస్-ఎస్ సూపరింటెండెంట్‌గానూ బదిలీ చేసినట్లు సమాచారం. ఈయన స్థానంలో కడప జిఎన్‌ఎస్‌ఎస్ విభాగానికి ఎవరినీ బదిలీ చేయకపోవడం గమనార్హం.

జిల్లా యువతకు అన్యాయం : డివైఎఫ్‌ఐ

ప్రజాశక్తి- కడప అర్బన్ : కడపలో సెయింట్ జోసఫ్ ఎయిడెడ్ బాయ్స్ హైస్కూల్‌లో నిర్వహించిన ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో జిల్లా యువతకు అన్యాయం జరిగిందని జిల్లా విద్యా శాఖ అధికారులు తగు విచారించి సమీక్షించాలని డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. మంగళవారం జిల్లా కార్యాలయం లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ నగరంలోని సెయింట్ జోసెఫ్ ఎయిడెడ్ బాలుర స్కూల్‌లో బిసి-ఎకు సంబంధించిన మ్యాథ్స్ పోస్టు భర్తీలో గోల్ మాల్ చోటు చేసుకుందని పేర్కొన్నారు. జిల్లాలోని నిరుద్యోగ అభ్యర్థులు ఉద్యోగాల కోసం నిరీక్షిస్తుంటే జిల్లా వారికి కాకుండా ఇతర జిల్లా అయిన తిరు పతికి చెందిన వ్యక్తులకు పోస్టులు భర్తీ చేయడంలో ఆంతర్యం ఏమిట న్నారు. యిడెడ్ పోస్టుల భర్తీలో జరిగిన అవకతవకల పై జిల్లా విద్యా శాఖ అధికారులు తగు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన నిర్వహి స్తామని హెచ్చరించారు. సమావేశంలో నగర కన్వీనర్ విజయ్, నిత్యా పాల్గొన్నారు.

డిగ్రీ సంస్కృతం పరీక్ష రద్దు

ప్రజాశక్తి- కడప అర్బన్ :యోగివేమన విద్యాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన డిగ్రీ సంస్కృతం పరీక్షను రద్దు చేసినట్లు విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి తెలిపారు. రాయచోటిలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల కేంద్రంలో పరీక్ష సమయంలో ప్రశ్నాపత్రం బయటకు వచ్చిందని విమర్శలు రావడంతో రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నామన్నారు. విషయం తెలియగానే పరీక్షల నియంత్రణ అధికారిని ఆచార్య కె.ఎస్.వి కృష్ణారావును పరీక్ష కేంద్రానికి పంపి స్వీయ పరిశీలన చేయించామన్నారు. కమిటీని ఏర్పాటు చేసి విచారణ చేయించి నిర్లక్ష్యానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అన్నమయ్య జిల్లా పరిధిలో ఒక విద్యార్థి , వైఎస్ఆర్ జిల్లాలో 99 మంది విద్యార్థులు రాసే ఈ పరీక్ష మళ్లీ నిర్వహిస్తామన్నారు. పరీక్ష తేదీ ఎప్పుడన్నది తర్వాత తెలియజేస్తామన్నారు. పరీక్షల విధుల్లో ఉన్నవారు నిత్యం అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా ఆదేశించారు.

అమ్మో.. చిరుతపులులు

ప్రజాశక్తి - లింగాల : మండలం పరిధిలోని తాతిరెడ్డిపల్లె గ్రామ పరిసరాల్లో మంగ ళవారం చిరుత పులులు సంచరించాయి. ఆ గ్రామంలోని మడుగు చేనులు దగ్గర తిరుగుతూ రెండు చిరుతపులు కనిపించాయి. గోపగాని అదినారాయణ అరటి తోటలోనూ సంచరించడంతో ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. తొలిసారిగా ఈ ప్రాంతంలో సంచరించిన చిరుతపులులను చంద్రమోహన్ అనే రైతు సెల్ ఫోన్‌లో వీడియో తీసి సంబంధిత అధికారులకు, గ్రామ ప్రజలకు సమాచారాన్ని చేరవేశారు. విషయం తెలుసుకున్న తహశీల్దారు ఈశ్వరయ్య చిరుతపులులు సంచరించిన ప్రదేశంలో పర్యటించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. కలెక్టర్ కార్యాలయానికి అటవీ శాఖ అధికారులకు సమాచారాన్ని తెలియజేశామని చెప్పారు. చిరుతపులుల బారిన పడకుండా ఉండేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఇన్‌ఛార్జి ఆర్‌ఐ గంగధర యాదవ్, విఆర్‌ఒ ఉన్నారు.



చిరుతలు సంచరించిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రజా సమస్యలను పారదర్శకంగా పరిష్కరించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - కడప

గ్రీవెన్స్‌సెల్‌లో వచ్చిన ప్రతి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకంగా పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. మంగళవారం అమరావతి నుండి సిసిఎల్ఎ జి. జయలక్ష్మి పిజిఆర్ఎస్. ఫిర్యాదుల పరిష్కారం, ఫ్రీ హోల్డ్ భూములు, డాటెడ్ ల్యాండ్స్, వాటర్ టాక్స్, రెవెన్యూ సదస్సులు తదితర అంశాలపై అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.స్థానిక కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ నుంచి కలెక్టర్‌తోపాటు జెసి అదితి సింగ్, డిఆర్‌ఒ విశ్వేశ్వర నాయుడు, రెవెన్యూ అధికారులు హాజయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా నవ్వుతూ పలకరించి, సహృదయంతో సమస్యను అర్థం చేసుకొని అర్జీలను స్వీకరించాలని అన్నారు. అర్జీదారుడు ఇచ్చిన వినతిని క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా పరిష్కార మార్గం చూపాలన్నారు. అర్జీదారునికి ఇచ్చే పరిష్కారంలో నాణ్యత లేకపోయినా, సరైన కచ్చితమైన సమాచారం ఇవ్వకపోయినా, అర్జీదారునికి సరిగా స్పందించకపోయినా ఉపేక్షించేది లేదని అధికారులను హెచ్చరించారు. పిజిఆర్‌ఎస్ కార్యక్రమాన్ని డివిజన్ స్థాయిలో, మండల స్థాయిలో తప్పనిసరిగా నిర్వహి ంచాల న్నారు. అర్జీదారుడు ఇబ్బంది పడకుండా అర్జీని రాసేందుకు హెల్ప్‌డెస్క్ ను ఏర్పాటు చేయాలని చెప్పారు.

విఆర్‌ఎపై దాడి హేయం

ప్రజాశక్తి - కడప అర్బన్ : సిద్ధవటం మండలంలో విఆర్‌ఎగా పనిచేస్తున్న కిషోర్ పై దాడి చేసి, గాయపరిచిన నిమ్మకాయల ఓబుల్ రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని ఎపి గ్రామ సేవకుల సహాయ సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు మనోహర్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటపతి, నాగేంద్ర, జిల్లా ట్రెజరర్ అశోక్ కుమార్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యంగా చిన్న స్థాయి ఉద్యోగిపైదాడి చేయడం దుర్మార్గమని తెలిపారు. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఓబుల్ రెడ్డి గతంలో కూడా దాడి చేశారని తెలిపారు. భూములు ఆక్రమించుకుని ప్రజలను ఇబ్బంది పెడుతూ ఉంటే విధి నిర్వహణలో భాగంగా వెళ్లిన కిషోర్ పై దాడి హేయమైన చర్యని పేర్కొన్నారు. వీటిపైన విచారణ చేసి ఓబుల్ రెడ్డిని తక్షణమే అరెస్ట్ చేయాలని తెలిపారు. లేకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని పేర్కొన్నారు.

ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని తరలించొద్దు

- రౌండ్ టేబుల్ సమావేశంలో నాయకులు

ప్రజాశక్తి - కడప అర్బన్

ఎపిజిబిలో మరో మూడు బ్యాంకుల విలీనమైన తర్వాత రాష్ట్రస్థాయి గ్రామీణ బ్యాంకు ప్రధాన కార్యాలయాన్ని కడపలోనే కొనసాగించాలని సేవ్ పబ్లిక్ సెక్టార్ కమిటీ కన్వీనర్ రఘునాథరెడ్డి, సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీనివాసులు రెడ్డి, మనోహర్, చంద్ర, ఎఐటియూసి ప్రధాన కార్యదర్శి నాగ సుబ్బారెడ్డి, మద్దిలేటి అన్నారు. మంగళవారం బిల్టప్ సర్కిల్ సమీపాన ఉన్న ఎపిజిబి యూనియన్ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంప్రదాయం ప్రకారం చూసినా, ఆర్థిక శాఖ మార్గదర్శకలో తొలి ప్రాధాన్యత ప్రకారం చూసినా రాష్ట్రస్థాయి ప్రధాన కార్యాలయాన్ని కడపలో కొనసాగించడమే సముచితమన్నారు. వ్యాపారం, టెక్నాలజీ, సొంతభవనాలు, ప్రజాభవనాలు విలీనం అవుతున్న సప్తగిరి, చైతన్య గోదావరి, ఎపి వికాస్ బ్యాంక్ కంటే మిన్నగా కడపలోని ఎపిజిబికే ఉన్నాయని అన్నారు. నూతన రాష్ట్రస్థాయి ఎపిజిబి పాలసీ, రుణ పరపతి విధానం, చినపరిశ్రమలకు అందించే తోడ్పాటు, వృత్తిదారులకు, వ్యాపార వర్గాలకు అందించే తోడ్పాటు ఇలా అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని రాయలసీమ లాంటి వెనకబడిన ప్రాంతాల్లో ఎపిజిబి ప్రధాన కార్యాలయం ఉంటేనే ఆ ఒరవడి కొనసాగుతుందన్నారు. సమావేశంలో ఎపిజిబి ఉద్యోగ సంఘాల నేతలు జగదీశ్వర్‌రెడ్డి, హరి ప్రసన్నకుమార్, మొహమ్మద్, హనుమంత రెడ్డి, ఎల్‌ఐసి యూనియన్ నేత అవధానం శ్రీనివాస్ జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాఘవరెడ్డి, బ్యాంకు ఉద్యోగ సంఘాల నాయకులు శ్రీనివాసులురెడ్డి, అజీజ్, లలిత, పోస్టల్ యూనియన్ నాయకుడు సుబ్బారెడ్డి, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు రామకృష్ణారెడ్డి, శివారెడ్డి, సాహితీ స్రవంతి బాధ్యుడు కుమారస్వామి, విద్యార్థి సంఘాల నాయకులు రవి, ఓబులేసు, నాయకులు , యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి



రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

ప్రీమియం డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి - వల్లూరు

పంట సాగు చేసే రైతులు మాత్రమే పంట బీమా ప్రీమియం డబ్బులు చెల్లించాలని కమలాపురం వ్యవసాయ సహాయ సంచాలకులు నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కొప్పోలి గ్రామంలో మండల వ్యవసాయ అధికారి సాయి జ్యోతితో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులు సాగు చేస్తున్న సెనగ, మినుము పంటలను పరిశీలించారు. రైతులకు తగు సలహాలు సూచనలు అందించారు. మినుము పంటలో పల్లాకు తెగులు నివారణకు స్పైరో మెసిఫెన 1 మిలీలీటరు మందును లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలన్నారు. రబీలో సాగుచేసిన అన్ని పంటలను తప్పనిసరిగా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు పంట నమోదు అన్ని పథకాలకు ప్రామాణికం అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు సుబ్బ నరసయ్య రైతులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కడప అర్బన్ : రైతులు రబీలో పంటల బీమా చేయించుకోవాలని కడప డివిజన్ వ్యవసాయ సంచాలకులు శంకర్ నాయక్ పేర్కొన్నారు. మంగళవారం పాత కడప గ్రామంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి సాగు చేసిన రైతులు ఈనెల 31, వేరుశనగ, ప్రొద్దుతిరుగుడు, మినుము, సెనగ సాగు చేసిన వారు ఈనెల 15 లోపు బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు. పంట నష్టపోయిన బీమా వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, మెహారాజు పావని పాల్గొన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి

ప్రజాశక్తి - కడప : వైసిపి బలోపేతానికి తాము కృషి చేస్తామని మాజీ డిప్యూటీ సిఎం ఎస్.బి. అంజాద్‌బాషా, నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. మంగళవారం కడప నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో కడప నియోజకవర్గానికి సంబంధించి అనుబంధ విభాగాల అధ్యక్షులు, వారి బయోడేటాను వైసిపి జిల్లా అధ్యక్షుడు పి రవీంద్రనాథ్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ అందరం ఐకమత్యంగా పార్టీని బలోపేతం చేసుకుందామన్నారు. ప్రభుత్వ వ్యతిరేక చర్యలను ఎండగడుతామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ హాజ్ కమిటీ చైర్మన్ గౌసుల్ ఆజం పాల్గొన్నారు.

యాక్షన్ ప్లాన్‌ను సవరించాలి

ప్రజాశక్తి - కడప అర్బన్ : రాష్ట్ర విద్యాశాఖ ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టర్ ఇచ్చినటువంటి ఎస్‌ఎస్‌సి యాక్షన్ ప్లాన్‌ను సవరించాలని ఎస్‌టియు నాయకులు కోరారు. మంగళవారం డిఇఒ మీనాక్షిని కలిసి ఎస్‌టియు కడప జిల్లా శాఖ అధ్యక్షులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కంభం బాలగంగిరెడ్డి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజులు యాక్షన్ ప్లాన్‌లో సాధారణ పని దినాల్లో కాకుండా ప్రభుత్వ సెలవులలో కూడా పనిచేయాలని ఆదేశించడం బాగా లేదని, సెలవు దినాలలో పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంలేని కారణంగా పిల్లలు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. సెలవు దినాల్లో పిల్లల హాజరు కూడా తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. అలాగే గతంలో డిసిసిబి వారు ప్రకటించిన ఎస్‌ఎస్‌సి యాక్షన్ ప్లాన్ చక్కగా ఉందని, దానినే అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ చెన్నకేశవరెడ్డి, నాయకులు చంద్రమోహన్ రెడ్డి, జబీబుల్లా పాల్గొన్నారు.



చిత్రాలు వేసిన విద్యార్థులతో కరస్పాండెంట్, ప్రిన్సిపల్

బధిర విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

ప్రజాశక్తి - కడప అర్బన్ :

అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని హెలెన్ కెల్లర్ బధిరుల విద్యాసంస్థల్లో విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. మంగళవారం పోటీలను విద్యాసంస్థల కరస్పాండెంట్ డాక్టర్ పి.దౌలత్ ఖాన్, ప్రిన్సిపల్ మసూద బేగం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సబ్ జూనియర్ కేటగిరీలో మహమ్మద్ ప్రథమ, చరిత ద్వితీయ స్థానం పొందారని పేర్కొన్నారు. జూనియర్ కేటగిరీలో చందు ప్రథమ స్థానం, యాస్మిన్ ద్వితీయ స్థానం సాధించాలని తెలిపారు. సబ్ సీనియర్ కేటగిరీలో చంద్రశేఖర్ ప్రథమ స్థానం, షరీఫ్ ద్వితీయ స్థానం పొందాలని చెప్పారు. సీనియర్ కేటగిరీలో జగదీష్ కుమార్ ప్రథమ స్థానం, శరత్ ద్వితీయ స్థానం సాధించారని పేర్కొన్నారు.

వసతి గృహాల తనిఖీ

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం అధికారులు వసతి గృహాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైవీయూ విసి ఆచార్య కె.కృష్ణారెడ్డి, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.రఘునాథ్‌రెడ్డి, రిజిస్ట్రార్ పి.పద్మ ఆహారశాలను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. వసతి గృహ విద్యార్థులు అవసరాలను ఆరా తీశారు. ఆహార పదార్థాల నాణ్యత, వసతి గృహాల్లో ఎదురవుతున్న అసౌకర్యాల గురించి తెలుసుకుని అన్ని సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

'కడప ఉక్కు'పై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికాదు

ప్రజాశక్తి - కడప అర్బన్ : కడప ఉక్కు ప్రతిపాదనే లేదని, ప్రతిపాదన వస్తే ఆలోచిస్తామని కేంద్రమంత్రి ప్రకటన చేయడం సమంజసం కాదని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంలో, రాష్ట్రంలో ఉక్కు కర్మాగారం కోసం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిరాహార దీక్షలు చేసిన నేతలు ఎందుకు మౌనంగా ఉన్నారని తెలిపారు. కేంద్రంలో టిడిపి అండతో నడుస్తున్న బిజెపి పై ఒత్తిడి చేసి ఉక్కు కర్మాగారం సాధించే దిశగా కృషి చేయాలని పేర్కొన్నారు. విభజన హామీలన్నింటికీ ఒక్కొక్కటిగా మంగళం పాడుతున్న కేంద్ర ప్రభుత్వం ఎపికి అన్యాయం చేస్తోందని తెలిపారు. కేవలం శంఖుస్థాపనలకే పరిమితమైన టిడిపి, వైసిపి ప్రభుత్వాలు కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తీసుకురావడంలో విఫలమయ్యాయని పేర్కొన్నారు. విభజన హామీలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర ప్రభుత్వం పై గట్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు. కడప ఉక్కు సాధించేవరకు సిపిఎం తమ పోరాటాన్ని కొనసాగిస్తుందని పేర్కొన్నారు. పోరాటానికి ప్రజలు అండగా ఉండాలని తెలిపారు.

విఆర్ఎ సంఘం నాయకుడికి సిపిఎం పరామర్శ

ప్రజాశక్తి-గోపవరం : తీవ్రమైన అనారోగ్యంతో కొన్ని వారాలుగా తిరుపతి రష్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని బద్వేల్‌లోని నివాస గృహంలో విశ్రాంతి పొందుతున్న ఎపి విఆర్ఎ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసి యేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశంను సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పచ్చకామెర్ల వ్యాధితో అనేక ఇబ్బందులు పడుతూ తిరుపతి రష్ ఆసుపత్రిలో అత్యవసర వైద్య చికిత్స చేయించుకుని, ఆరో గ్యం కాస్త కుదటపడడంతో ఇంటివద్ద విశ్రాంతి తీసుకుంటున్నారని తెలిపారు. మెరుగైన వైద్యం చేయించుకోవాలని, భయపడవద్దని ధైర్యంగా ఉండాలని, ఆయన త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉంటారని పేర్కొన్నారు.



నాగేశంను పరామర్శిస్తున్న జిల్లా కార్యదర్శి


పార్లపల్లెలో వరి పంట పరిశీలిస్తున్న ఎఒ రమేష్

120 ఎకరాల్లో నేలకొరిగిన వరి పంట

ప్రజాశక్తి - లింగాల

గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షం ప్రభావంతో మండల పరిధిలోని పార్లపల్లిలో 120 ఎకరాల్లో వరి పంట నేలకొరిగింది. పంట సాగుచేసిన 60 మంది రైతుల్లో ఆందోళన నెలకొంది. పంట చేతికొచ్చే సమయంలో భీకరంగా నష్టపోయామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ పంటలను పరిశీలించారు. నష్టపోయిన దాన్ని అంచనా వేశారు. వివరాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.


రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయాధికారులు

వరి రైతులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - చాపాడు

ఫెంగల్ తుపానుతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరి రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయ శాఖ మైదుకూరు డివిజన్ ఎడిఎ కృష్ణమూర్తి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని బద్రిపల్లె, నెర్జాంపాడు గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి మాగ్గి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడిఎ రైతులతో మాట్లాడుతూ తుపాను కారణంగా వరి కోతలను కొన్ని రోజులపాటు తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలన్నారు. వరి నూర్పిడి చేసి ఉంచే ధాన్యం తడవకుండా టార్పలిన్ పట్టలతో కప్పి ఉంచుకోవాలన్నారు. అధిక వర్షం పడితే నీరు నిలువ లేకుండా ప్రవహించేలా కాలువలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. పొరపాటున ధాన్యం గింజ వర్షానికి తడిస్తే మొలకలు రాకుండా ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేయాలన్నారు. తుపాను తర్వాత తెగుళ్ల సంభవించకుండా ట్రైకోడెర్మ 2 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. వ్యవసాయ అధికారి మాగ్గి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు సాగుచేసిన రైతులు ఈనెల 15లోగా బీమా చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విఎఎ సురేష్, రైతులు పాల్గొన్నారు.

వేముల : స్థానిక చాగలేరు రైతు సేవ కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. ఏఓ వ్యవసాయ అధికారులు పద్మజ, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు. శనగలో తడి వేరుకుళ్లు తెగులు గురించి మాట్లాడుతూ.. ఈ వ్యాధి లక్షణాలు మొదలుకుల్లు తెగులు లక్షణాలని పోలి ఉంటాయన్నారు. ఈ వ్యాధి సోకిన మొక్కలు అక్కడక్కడ ఎండిపోతుంటాయన్నారు. మండల వ్యవసాయ అధికారి వి.చెన్నారెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో పంటల బీమాకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించిందన్నారు. రైతులే ప్రీమియాన్ని మీ సేవ కేంద్రం, గ్రామ సచివాలయం డిజిటల్ అసిస్టెంట్ దగ్గర కానీ చెల్లించాలన్నారు. ఈనెల 15లోపు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో చాగలేరు వ్యవసాయ అసిస్టెంట్ లలిత, రైతులు పాల్గొన్నారు.

బాబు రాజేంద్రప్రసాద్ ఆదర్శనీయుడు

ప్రజాశక్తి - వేంపల్లె

భారత తొలి రాష్ట్రపతి, భారత రత్న బాబు రాజేంద్రప్రసాద్ గొప్ప దేశ భక్తుడు, స్వాతంత్ర్య సమర యోధుడని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి కొనియాడారు. రాజేంద్ర ప్రసాద్ 140వ జయంతి సందర్భంగా మంగళవారం వేంపల్లె కాంగ్రెస్ నాయకులు ఆయన చిత్ర పటానికి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు డాక్టర్ సుబ్రమణ్యం, ఉమ్మార్‌రెడ్డి, ఉత్తన్న, మహబూబ్ బాషా, బద్రినాథ్, అరుసేర్ల సుబ్బరాయుడు, రమణ పాల్గొన్నారు.

వైసిపి ప్రభుత్వంలో అభివృద్ధి శూన్యం

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గత వైసిపి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి శూన్యమని పులివెందుల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ధ్రువకుమార్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఆయన పులివెందుల మండల నాయకులు తుమ్మలూరు అనిల్‌కుమార్ రెడ్డితో కలిసి పట్టణంలోని జగనన్న కాలనీలో నిలిచిపోయిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ధ్రువకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేద ప్రజలకు ఇచ్చిన ఎనిమిది వేల ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయని తెలిపారు. ఇల్లులేని ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణ పనులను కూటమి ప్రభుత్వం కూడా పులివెందులపై చిన్న చూపు చూస్తోందన్నారు. కార్యక్రమంలో నాయకులు వినోద్‌కుమార్ రెడ్డి, శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, అంకిరెడ్డి, అనిల్‌కుమార్ రెడ్డి, సాయి పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కుందూనదిలో గల్లంతై వృద్ధురాలు మృతి

ప్రజాశక్తి - చాపాడు


మృతి చెందిన సుబ్బమ్మ

మండలంలోని సీతారామాపురం సమీపంలో ఉన్న కుందూనదిలో మంగళవారం పూజలు చేసుకునేందుకు వెళ్లి ప్రమాదశాత్తూ గల్లంతై అల్లాడుపల్లెకు చెందిన నూక బోయిన సుబ్బమ్మ(70) అనే వృద్ధురాలు మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులో నివాసం ఉంటున్న అల్లాడుపల్లెకు చెందిన సుబ్బమ్మ మంగళవారం ఉదయం 11గంటల ప్రాంతంలో కుందూనది వద్ద స్నానం చేసి పూజలు చేసుకునేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ప్రమాదశాత్తూ నీటిలో గల్లంతైంది. సుబ్బమ్మ ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో చెల్లెలు కుమారుడు మనీంద్ర సుబ్బమ్మ సెల్‌ఫోన్‌కు కాల్ చేయగా స్థానికులు లిఫ్ట్ చేసి నదిలో పడిపోయినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు నది వద్దకు చేరుకుని పరిశీలించగా సుబ్బమ్మ చనిపోయి ఉంది. మృతురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. సుబ్బమ్మకు వివాహితులైన ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు.

దాడి కేసులో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి - ముద్దనూరు

వెల్లుచ్చెర్ల గ్రామంలో గొర్రెల దొంగతనం విషయమై జరిగిన గొడవలో ఇద్దరు వ్యక్తులపై కత్తులతో దాడి చేసి గాయపరిచిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు సిఐ దస్తగిరి తెలిపారు. సిఐ తెలిపిన వివరాల ప్రకారం.. వెల్లుచెర్ల గ్రామానికి చెందిన ఈశ్వరయ్య, శివశంకర్‌ను మంగళవారం చిన్న దుద్యాల మలుపు వద్ద అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. బొలెరో వాహనం, కొడవలిని సీజ్ చేశామన్నారు.

ఎర్రగుంట్ల కూడలి రోడ్డు విస్తరణలో భాగంగా

చిరువ్యాపారుల దుకాణాలు తొలగింపు


నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న చిరు దుకాణాలను తొలగిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఎర్రగుంట్ల

ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం అధికారులు రోడ్డు విస్తరణను చేపట్టారు. ప్రత్యామ్నాయ మార్గాలు చూపకుండా తమ వ్యాపారాలు తీసివేయించడంతో దశాబ్దాలుగా రోడ్ల పక్కన వ్యాపారాలు చేసుకుంటున్న చిరు వ్యాపారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. రోడ్డు పక్కన తోపుడు బండ్లపై పూలు, పండ్లు, కూరగాయల అంగళ్లు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు. అరుగులు ఏర్పాటు చేసుకుని చెప్పులు కుట్టుకుంటూ మరికొందరు జీవనం సాగిస్తున్నారు. కేవలం ఒకరోజు సమయం ఇచ్చి వ్యాపారానికి తాము తాత్కాలికంగా ఏర్పరచుకున్న వాటిని తొలగించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. తాము తెచ్చుకున్న పూలు, పండ్లు చెడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2015లో మున్సిపాలిటీకి తాము ఒక్కో వ్యాపారానికి రూ.15,500 గుడ్‌విల్ అమౌంటు చెల్లించామని, దినసరి గేటుగా ప్రతిరోజు రూ.70 చెల్లిస్తున్నామని బాధితులు వివరించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న మున్సిపల్ కమిషనర్ శేషఫణితో వ్యాపారానికి ప్రత్యామ్నాయంగా తమకు స్థలం చూపించాలని అడిగారు. సిపిఎం నాయకులు వి అన్వేష్ బాధితులకు తక్షణ పరిష్కారం చూపాలని కమిషనర్‌ను కోరారు. తమకు మూడు రోజులు సమయం ఇవ్వాలని చిరు వ్యాపారులకు స్థలం చూపిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో కూడలి వద్ద పెద్ద ఎత్తున స్థానికులు గుమికూడడంతో పోలీసులు చేరుకొని ట్రాఫిక్‌ను నియంత్రించారు.

ప్రమాదాల నివారణకే రోడ్డు విస్తరణ
- మున్సిపల్ కమిషనర్ శేషఫణి

పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలిలో తరచూ ప్రమాదాలు జరుగు తున్నాయని, వాటి నివారణకు రోడ్డు విస్తరణ చేసేందుకు చర్యలు తీసుకున్నామని మున్సిపల్ కమిషనర్ శేషఫణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విషయాన్ని ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. ఆయన స్పందించి రూ.8లక్షలు మంజూరు చేశారని తెలిపారు. డిమార్కేషన్ సర్వే నిర్వహించి మార్కింగ్ ఇచ్చామని వివరించారు. ఆ మార్కింగ్‌లోనున్న చిరు వ్యాపారులను ఇదివరకే ఖాళీ చేయమని చెప్పామన్నారు. మంగళవారం తాత్కాలిక నిర్మాణాలను తొలగించామని తెలిపారు. ఎమ్మెల్యే ఆది ఆదేశానుసారం పనులు జరుగుతున్నాయని, త్వరలో రోడ్డు విస్తరణ ప్రక్రియ ప్రారంభిస్తామని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

చిరు వ్యాపారులకు స్థలాలు కేటాయించాలి

ఎర్రగుంట్ల నాలుగు రోడ్ల కూడలిలో ఉన్నఫళంగా దుకాణాలు తీయించిన చిరు వ్యాపారులకు స్థలాలు కేటాయించాలని సిపిఎం, సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణలో భాగంగా కూడలిలో ఇరువైపులా మున్సిపాలిటీ అధికారులు జెసిబి యంత్రంతో తొలగించారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు వి అన్వేష్, సిపిఐ నాయకులు ఎంవి సుబ్బారెడ్డి, టిసి ఓబులరెడ్డి కమిషనర్ శేషఫణిని కలిసి మాట్లాడారు. చిరు వ్యాపారులకు కూడలిలో ఏదో ఒక వైపు స్థలం కేటాయించి ఆదుకోవాలని కోరారు. స్పందించిన కమిషనర్ రెండుమూడు రోజుల్లో వారికి ఒకచోట స్థలాలు చూపిస్తామని హామీ ఇచ్చారు. విఆర్‌ఒల సంఘం మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి రెడ్డి, మస్తాన్, షరీఫ్, మహబూబ్ బాషా, చిరువ్యాపారులు పాల్గొన్నారు.


కమిషనర్‌తో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు, బాధితులు

రేషన్ మిల్లులు, గోడౌన్లపై నిఘా పెట్టాలి

- పౌర సరఫరాల శాఖ మంత్రికి ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి లేఖ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల నియోజకవర్గంలోని రేషన్ మిల్లులు, గోడౌన్‌లపై నిఘా పెట్టాలని శాసనమండలి సభ్యుడు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు మంగళవారం లేఖ రాశారు. రేషన్ కార్డుదారులకు అందాల్సిన బియ్యం పక్కదారి పడుతోందన్నారు. పులివెందులలో రూ.కోటిపైగా రేషన్ బియ్యం అక్రమ రవాణా జరుగుతోందన్నారు. పులివెందుల అనంతపురం జిల్లా సరిహద్దులో ఉండడంతో అక్రమ రవాణాకు, బియ్యం నిల్వలకు వీలుగా ఉంటుందని అడ్డాగా స్మగ్లర్లు మార్చుకున్నారని తెలిపారు. 2019 నుంచి గత ప్రభుత్వం కాలంలో ఎవరైతే స్మగ్లింగ్ పాల్పడ్డారో ఇప్పుడు కూడా వారే వ్యాపారం చేస్తున్నారంటే వీరు ఎంత శక్తివంతులుగా ఉన్నారో అర్థమవుతుదని తెలిపారు. ఒక్క పులివెందుల నియోజకవర్గంలోనే స్మగ్లర్లు ప్రతినెల రూ.కోటి అర్జిస్తున్నారు. ముఖ్యంగా సత్యసాయి జిల్లా, ముదిగుబ్బకు చెందిన వైసిపి నాయకుడు మిత్రమ నాయుడు, వేంపల్లి మండలానికి చెందిన ఒక వైసిపి మాజీ ప్రజాప్రతినిధి, ముదిగుబ్బకు చెందిన శ్రీరామ్ నాయక్ ఈ నేరంలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఆరోపించారు. వీరు పులివెందులలోనే కాకుండా కమలాపురం, జమ్మలమడుగు, రాయచోటి, ప్రొద్దుటూరు ప్రాంతాల నుంచి కూడా బియ్యాన్ని సేకరించి పులివెందుల కేంద్రంగా వ్యాపారం చేస్తున్నారు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, పులివెందుల నుంచి అనంతపురం జిల్లాకు ఉన్న సరిహద్దులో నిఘా పెంచాలని, చర్యలు చేపట్టని అధికారులపై కూడా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కోరారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ నాగరాజు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కోవరం గుట్టపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సందర్భంగా ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందన్నారు. ముందు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు అంశాలపై తగు సూచనలు చేశారు. ఉప వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఖాజా మొద్దీన్, వైద్యులు స్రవంతి, ప్రతుష్య, ఎఎంఒ వెంకటరెడ్డి, సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య, సీనియర్ అసిస్టెంట్ నరేష్, సూపర్‌వైజర్ రాఘవ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం : ఆశా డే సందర్భంగా మంగళవారం బి.మఠం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ డాక్టర్ రవిబాబు సందర్శించారు. ఎజెండాలో భాగమైన గర్భిణుల నమోదు, కష్టతరమైన గర్భిణుల సేవలు, ఆరు నెలల దాటిన పిల్లల అదనపు ఆహారం, పిహెచ్‌సిలో నెలకు 5 ప్రసవాలు, ఆశ కిల్కారి సేవలు, ఆశాలు చేయవలసిన ఐదు ఇండికేటర్లపై అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం జరిగే ప్రోగ్రాములు ఎన్సిడి 3-0 క్యాన్సర్ స్క్రీనింగ్, స్కూల్ హెల్త్ ప్రోగ్రాం తదితర వాటిపై ఆయన సమీక్షించారు. అనంతరం కాన్పుల గది, ఐపి వార్డు పరిశీలించి సిబ్బంది తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో సిహెచ్ఒ సాంబశివారెడ్డి, సూపర్వైజర్స్ పుష్పరాజు, రమణమ్మ , ఏఎన్ఎంలు, సిహెచ్ఓలు, ఆశాలు పాల్గొన్నారు.


సూచనలిస్తున్న జిల్లా అడిషనల్ డిఎంహెచ్ఒ రవిబాబు


సమావేశంలో మాట్లాడుతున్న సుహాషిణి

పులివెందుల అరటికి డిమాండ్

- ఎగుమతులు పెంచడానికి వ్యాపారులు కృషి చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

దేశంలో పులివెందుల అరటికి ఎక్కువ డిమాండ్ ఉందని, ఎగుమతులు పెంచడానికి వ్యాపారులు కృషి చేయాలని జిల్లా ఉద్యాన అధికారి ఎస్ఎస్వి సుహాషిణి సూచించారు. స్థానిక ఉద్యానవన కార్యాలయంలో మంగళవారం పులివెందుల అరటి ఎగుమతులపై వ్యాపారులతో ఆమె సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. విదేశాల్లో కూడా పులివెందుల అరటికి ఎక్కువ డిమాండ్ ఉందన్నారు. అయితే ఆశించిన రీతిలో దిగుమతులు లేవన్నారు. ఇందుకు వ్యాపారులు మాట్లాడుతూ ప్రస్తుతం కురిసిన వర్షాలతో అరటి కాయల నాణ్యత దెబ్బ తిందన్నారు. ఇతర దేశాల్లో ఆగష్టు నుండి మార్చి 10వ తేదీ వరకు అరటి కాయలకు డిమాండ్ ఉంటుందన్నారు. మన ప్రాంతంలో ఆ సమయంలో ఆశించినంత దిగుబడి అందుబాటులో ఉండదని వారు వివరించారు. ఇందుకు ఆమె స్పందిస్తూ నాణ్యతను పెంపొందించేందుకు క్షేత్రస్థాయిలో రైతు శిక్షణా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రోత్సహించేందుకు పులివెందులలో ఫుడ్ ప్రాసెసింగ్ క్లస్టర్‌ను కూడా ఏర్పాటు చేశామన్నారు. అవకాశాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యకమంలో పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి, అరటి వ్యాపారులు, రైతులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య పరీక్షలకు విశేష స్పందన

ప్రజాశక్తి - లింగాల

లింగాల జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో 118మందికి పరీక్షలు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. భారతి పాలిమర్స్ ప్రయివేటు లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో పుష్పగిరి కంటి ఆసుపత్రి సిబ్బంది 5 మంది వైద్యులు పరీక్షించారు. 20 మందికి కంటి అద్దాలు, అపరేషన్ అవసరమైన వారికి మండలం నుంచి బస్సును ఏర్పాటు చేసి ఉచితంగా కంటి అపరేషన్ చేసి వారి గ్రామాలకు సురక్షితంగా చేరుస్తామన్నారు. ఎస్ఐ మధుసుథన్ రావు పలు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో భారతి పాలిమర్స్‌ప్రయివేటు లిమిటెడ్ జీఎం వల్లపునేని శ్రీనివాసరావు, మేనేజరు జగన్మోహనరావు, హెచ్ఆర్ గంగారాజు, మెకానికల్ ఇంజనీర్ పవన్ విశ్వేశ్వరరెడ్డి, లింగాల సర్పంచ్ జూలువకర్ పాల్గొన్నారు.

ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు మండలం ఖాదరాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించాలని మూవ్‌మెంట్‌ఫర్ పీస్ అండ్ జస్టిస్ (ఎంపిజె)రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ సలీం కోరారు. ఆ మేరకు ఎంఇఒలు సావిత్రమ్మ, శోభారాణికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాదరాబాద్ ఉర్దూ పాఠశాలలో 90 మంది విద్యార్థులున్నారన్నారు. గతంలో ఈ పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారన్నారు. వీరిలో ఒకరు జూన్‌లో ఉద్యోగ విరమణ పొందారని, మరొకరిని డిప్యుటేషన్‌పై నియమించారన్నారు. 90 మంది విద్యార్థులకు బోధించేందుకు కనీసం ఐదు మంది అవసరమన్నారు. ఉపాధ్యాయులు తక్కువగా ఉండడంతో సరైన విద్య అందడం లేదన్నారు. కార్యదర్శి రఫీ, మీడియా కార్యదర్శి అస్లాం, యుక్తియార్ పాల్గొన్నారు.


ఎంఇఒకు వినతిపత్రం అందజేస్తున్న సలీం

ప్రజలకు సురక్షిత నీటిని అందించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు


ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ మల్లికార్జున

ఆరోగ్యంగా ఉండాలంటే సురక్షిత నీరు చాలా అవసరమని, అలాంటి నీటిని ప్రజలకు అందించాలని మున్సిపల్ కమిషనర్ మల్లి కార్జున తెలిపారు. పట్టణ పర్యటనలో భాగంగా మంగళవారం కమిషనర్ రామేశ్వరంలోని వాటర్ హెడ్ వర్క్స్ వద్ద ఉన్న వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సందర్శించారు. నీటి శుద్ధి ప్రక్రియను పరిశీలించారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని కమిషనర్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు.

ముగిసిన జిందేషా మదార్ షావలి ఉరుసు

వేంపల్లె : స్థానిక పాపాగ్ని నది ఒడ్డున వెలసిన శ్రీహజరత్ సయ్యద్ ఖ్వాజా దర్ బార్ జిందేషా మదార్ షా వలి ఉరుసు మంగళవారం ఘనంగా ముగిసింది. రెండు రోజులుగా ఉరుసు వేడుకలను దర్గా కమిటీ సభ్యులు నిర్వహించారు. సోమవారం రాత్రి ఖవ్వాలీ పోటీలను నిర్వహించారు. సిఐ సురేష్‌రెడ్డి అదేశాలు మేరకు ఎస్ఐలు తిరుపాల్ నాయక్, రంగారావు సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పాస్‌పోర్టు పోయినది

తేదీ: 29.11.2024 నాకు ప్రొద్దుటూరు గాంధీరోడ్డులో జిరాక్స్ చేయించుకొని ఇంటికి తిరిగి వచ్చే సమయంలో నాపాస్‌పోర్టు పోయినది. నా పాస్‌పోర్టు నెం. 8763087. దొరికినచో ఎ.జిలానీ బాషా తండ్రి కమాల్ బాషా, 6/696 ఆర్ట్స్ కాలేజీ రోడ్డు, ప్రొద్దుటూరు, వై.ఎస్.ఆర్.జిల్లా ఫోన్: 7337494726కు దయచేసి చేర్పించగలరు.


కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి

సమాజంలో సమాన అవకాశాలు కల్పించాలి : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

విభిన్నప్రతిభావంతులకు సమాజంలో సమాన అవకాశాలు కల్పించాలని శాసన మండలి సభ్యుడు భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్సీ స్వగృహంలో విభిన్న ప్రతిభావంతులతో కలిసి కేక్ కట్ చేసి వారికి శుభా కాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో అందరితో సమానంగా, సగౌరవంగా విభిన్న ప్రతిభావంతులు బతికేలా ప్రజాప్రతినిధులు, చారిటబుల్ ట్రస్టులు సేవాభావంతో పనిచేయాలని కోరారు. వారికి ఏ అవసరం వచ్చినా ఎప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కడప జిల్లా విభిన్న ప్రతిభావంతుల అధ్యక్షుడు సిద్ధన మురళి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్రం వీరారెడ్డి, పులివెందుల అధ్యక్షుడు మదూరు నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులతో భోజనం వడ్డించొద్దు

విద్యార్థులతో భోజనం వడ్డించడం మంచి పద్ధతి కాదని శాసనమండలి భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణ పరిధిలోని మహాత్మ జ్యోతిరావ్ పూలే బీసీ గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధిత సిబ్బందితో వడ్డించాలని సూచించారు. అవసరమైతే టీచర్లు వడ్డించాలన్నారు. పాఠశాల విద్యార్థులను అడిగి మధ్యాహ్న భోజనం నాణ్యత గురించి తెలుసుకున్నారు. జూన్ కల్లా పనులు పూర్తి చేసి పాఠశాలను తొండూరుకు మారుస్తామని ఎమ్మెల్సీ తెలిపారు. హాస్టల్ గదులను, టాయిలెట్స్‌ను పరిశీలించారు.

రూ.10 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

కొత్తపల్లె పంచాయతీ మిట్ట బాలాజీ నగర్‌లో రూ.10 లక్షల వ్యయంతో సిసి రోడ్డు పనులను జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తపల్లె పంచాయతీ ఆటోనగర్, మిట్ట బాలాజీనగర్ కాలనీలో మంగళవారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి చొరవతో సిసి రోడ్డుకు భూమిపూజ చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. కొత్తపల్లి పంచాయతీలో పలు అభివృద్ధి కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఎక్కడైనా సమస్యలుంటే కొత్తపల్లి గ్రామ ప్రజలు తమ దృష్టికి తెస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. కొత్తపల్లి పంచాయతీ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో 13వ వార్డ్ మెంబెర్ కొనిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి, ఎఇ గణేష్, నంగునూరు పల్లె నాగేష్ యాదవ్, సుబ్రమణ్యం, షరీఫ్, శరత్, బాలాజీ నగర్ ప్రజలు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ వన్ బీ వచ్చేలా చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వేంపల్లె

పంటల ప్రీమియం చెల్లించేందుకు ఆన్‌లైన్‌లో వన్ బీ వచ్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరారు. ఆ మేరకు మంగళవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దార్ హరినాథ్‌రెడ్డికి రైతులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ముత్తుకూరు, నాగూరు, అయ్యవారిపల్లె, కత్తులూరు, అమ్మగారిపల్లె, రామిరెడ్డిపల్లి, పాములూరు గ్రామాల్లో గత వైసిపి ప్రభుత్వం భూముల రీ సర్వే చేపట్టడం వల్ల 60 శాతం మంది రైతులకు ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పిఎం) నెంబర్లు ఇవ్వకపోవడంతో వన్ బీ ఆండగల్ రావడం లేదన్నారు. ఈనెల 15లోగా పంటల ప్రీమియం చెల్లించేందుకు గడువు ఉందన్నారు. రీ సర్వే చేయించుకున్న రైతులకు వన్ బీ రాకపోవడంతో చాలా మంది రైతులు ప్రీమియం చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. తహశీల్దార్ స్పందించి తక్షణమే ఈ విషయాన్ని ఆర్‌డిఒ దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

నీటి సంఘం ఎన్నికలకు 13,713 మంది ఓటర్లు

ప్రజాశక్తి - చాపాడు

మండలంలో ఈ నెల 8న నిర్వహించే నీటి సంఘం ఎన్నికలకు 13,713 మంది రైతులు ఓటర్లుగా అర్హత సాధించారని డిటి కృష్ణారెడ్డి తెలిపారు. 9,688 మంది పురుషులు, 4,025 మంది మహిళా ఓటర్లు ఉన్నారన్నారు. మండల పరిధిలో మొత్తం 10 టిసీలు ఉండగా 7 టీసీలు చాపాడు మండల పరిధిలో ఎన్నికలు నిర్వహించనుండగా, ఒక టిసీకి ప్రొద్దుటూరు, ఒకటి దువ్వూరు, ఒక టిసీకి ఖాజీపేట పరిధిలో ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు.

'బడి వైపు ఒక అడుగు'ను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ఈనెల 7న నిర్వహించే బడి వైపు ఒక అడుగు-తల్లిదండ్రులతో ముచ్చట్లు అనే కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మండల ప్రత్యేక అధికారి సనన్న సూచించారు. సింహాద్రిపురం ఎంపిడిఒ కార్యాలయ సభా భవనంలో మంగళవారం నిర్వహించిన మెగా పిటిఎం తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన వివరించారు. ఎంపిడిఒ కృష్ణమూర్తి, ఎంఈఓ-శారద మాట్లాడుతూ ప్రధానోపాధ్యాయులకు సమావేశం సందర్భంగా దిశానిర్దేశాలు చేశారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్ జగదీశ్వర్‌రెడ్డి, ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ అరవింద్, ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


అనాథ వృద్ధులకు దుస్తులు పంపిణీ చేస్తున్న వైసిపి నేత శ్రీను

అనాథ వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి - వేంపల్లె : రాజీవ్ కాలనీలో ఉన్న అమ్మ అనాథ వృద్ధాశ్రమంలో మంగళవారం చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామానుజులరెడ్డి పుట్టినరోజు సందర్భంగా వైసిపి నాయకుడు డేరంగుల శ్రీను దుప్పట్లు పంపిణీ చేశారు. వృద్ధుల మధ్య కేక్ కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. అన్నదానం చేశారు. స్వీట్లు, పండ్లు అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీను, ఆశ్రమ నిర్వాహకుడు వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

మహారాజశ్రీ మూడవ
అదనపు జూనియర్ సివిల్ జడ్జివారికోర్టు:: కడప
ఓ.యస్. 869 /2020

వెండికట్ల సుబ్బమ్మ అలియాస్ కొవ్వూరు సుబ్బమ్మ, తండ్రి కొవ్వూరు చిన్న సుబ్బరాయుడు, భర్త లేట్ వెండికట్ల నరసింహులు, డోర్ నెం.1/275, శెట్టివారిపల్లి, దస్తగిరి స్వామి గుడి దగ్గర, మైదుకూరు మండలం, కడప జిల్లా ...వాది/పిటిషనరు

వర్సెస్

1. వెండికట్ల సుబ్బన్న, తండ్రి లేట్ హిమామ్ సాహెబ్, డోర్ నెం. 38/105, బుడ్డాయపల్లె, రామాలయం పక్కన, కడప.
2. వెండికట్ల బాబు, తండ్రి వి.సుబ్బన్న, డోర్‌నెం.38/105, బుడ్డాయపల్లె, రామాలయం పక్కన, కడప ...ప్రతివాదులు/రెస్పాండెంట్ నెం. 1 & 3

సమను

పై నెంబరు దావాను భాగపరిష్కారం కోరుచూ దాఖలు చేసినందున ఇందు విషయమై ఆక్షేపణలు ఉన్న యెడల 05.12.2024వ తేదీన ఉ॥10:30ని॥లకు పై కోర్టులో ఖుద్దునగానీ, వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల సదరు విషయమై మీ పరోక్షమున విచారించి తీర్మాణము చేయుదురని తెలియజేయడమైనది.

ఎం. నాగిరెడ్డి
పిటిషనరు తరపు న్యాయవాది